క్లుప్తంగా

రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : పీలేరు పట్టణం తిరుపతి రోడ్డు మార్గంలో రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శనివారం ఆ పనులను పర్యవేక్షించిన ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న మురుగునీటి కాలువల పైకప్పులు తొలగించి నూతనంగా మురుగునీటి కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ప్రజారోగ్యానికి, మంచినీటి సౌకర్యం కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో రెడ్డిప్రసాద్, కాలనీ చిన్న, రవి, అబీద్, మునీర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్ట్

నిమ్మనపల్లె : కోడిపందెం స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ పి.రామకృష్ణ తెలిపారు. నిమ్మనపల్లె పంచాయతీలోని నాగులయ్యగారిపల్లె సమీపంలో శనివారం కొంతమంది కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం అందిందని ఆయన పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి మూడు పందెం కోళ్లను, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మృతుడి తల్లిదండ్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని మెడికల్ షాపు నారాయణరెడ్డి కుమారుడు యశ్విత్‌రెడ్డి(18) ద్విచక్ర వాహనంలో శుక్రవారం అమ్మమ్మగారి ఊరు గంగవరం మండలం కీలపట్లకు వెళ్తూ గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. ఆ విద్యార్థి మృతదేహానికి శనివారం స్వగ్రామం కోసువారిపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లెలో అంత్యక్రియలు జరిగాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి హాజరయ్యారు. మృతదేహాన్ని సందర్శించారు. నివాళులర్పించి, తల్లిదండ్రులను ఓదార్చారు. తంబళ్లపల్లె మండలంలోని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున అంత్యక్రియల్లో పాల్గొని ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఘనంగా హరిప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు



హరిప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

పీలేరు రూరల్ : వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జి హరిప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీలేరుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థి విభాగం నాయకులు శనివారం తిరుపతిలో ఆయన్ను కలసి శాలువలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి చక్రధర్, నాయకులు పి.ద్వారకనాథరెడ్డి, లోకనాథరెడ్డి, ధర్మారెడ్డి, రవి, కాలనీ చిన్న, మునీర్, రియాజ్, అబీద్, పాపిరెడ్డి, హేమంత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

కలికిరి : తల్లిదండ్రులపై అలిగి వెళ్లిన బాలికను వారికి అప్పగించారు. ఎస్‌ఐ రహీముల్లా కథనం మేరకు.. మదనపల్లి పట్టణం చౌడేశ్వరి సర్కిల్ వద్ద నివాసం ఉంటున్న సురేంద్ర కుమార్తె స్నేహ(11) తల్లిదండ్రులపై అలిగి పీలేరు బస్సు ఎక్కింది. బాలిక ఒంటరిగా ఉండటంతో ప్రయాణికులు, కండక్టరు గుర్తించి కలికిరి పోలీసులకు సమాచారమిచ్చారు. బాలికను విచారించిన ఎస్‌ఐ తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం

ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం మండలంలోని ముష్టూరు పంచాయతీలోని దిగువపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సర్పంచ్ చంద్రాయుడు, ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రభుత్వం గత నాలుగేళ్లుగా అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలంటూ ఎమ్మెల్యే స్థానికులను అడిగారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, సిమెంట్‌రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, పింఛన్లు, వికలాంగ పింఛన్లు, దారి ఏర్పాటు, రేషన్‌కార్డుల మంజూరు, ఆరోగ్యశ్రీ కార్డుల్లో మార్పులు, అధికంగా రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తెచ్చి పేద ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారన్నారు. అనుక్షణం ప్రజల కోసమే ఆలోచిస్తూ ప్రజల కోసం పని చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి అధికారంలోకి వచ్చేలా ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, నరేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రాజగోపాల్, రెడ్డిభాస్కర్, కొండగాళ్లరమణ, తహసీల్దార్ సీఆర్.మంజుల, ఎంపీడీఓ లీలామాధవి, ఎస్‌ఐ రామకృష్ణ, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా పైడిమర్రి జయంతి

వాల్మీకిపురం : ప్రతిజ్ఞ రచయిత పైడిమర్రి వెంకటసుబ్బారావు జయంతి వేడుకలను శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పైడిమర్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశం నా మాతృభూమి అనే ప్రతిజ్ఞ ద్వారా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరి గుండెల్లో దేశభక్తిని, జాతీయ సమైక్యతను, సమగ్రతను చాటి చెప్పిన మన తెలుగువాడు పైడిమర్రి అన్నారు. ప్రతిజ్ఞ గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకటరత్నం, ఉపాధ్యాయులు రవీంద్రరెడ్డి, సీఆర్‌పి ముత్యాలు, విజయ్ కుమార్, ఉమాపతి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పైడిమర్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ

మదనపల్లె సిటీ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఐఈసీ ఆఫీసర్ కృష్ణమూర్తి ఆవిష్కరించారు. దాతల సహాయ, సహకారాలతో వివేకానంద విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని కోరారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు నరేంద్ర, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి లక్ష్మీపతి, పాఠశాల హెచ్‌ఎంలు రెడ్డన్నశెట్టి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద విగ్రహం వద్ద వాసవీక్లబ్ సభ్యులు

వేసవి శిక్షణ శిబిరాలు ప్రయోజనకరం

బి.కొత్తకోట : గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయంలో శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిశేఖర్, నగర పంచాయతీ మేనేజర్ రమాదేవి, ఆదర్శ విద్యాలయ ప్రిన్సిపాల్ శీనునాయక్, జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్, గ్రంథాలయాధికారి ఎం.తులసినాయక్ పాల్గొన్నారు.



బి.కొత్తకోట: పిల్లలకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీఓ, ఎంఈవో

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

పీలేరు : ప్రతి విద్యార్థి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఏఎస్‌వో రామ్మోహన్ అన్నారు. స్థానిక మదనపల్లె రోడ్డులోని హోత్రిశ్రీ బ్యాడ్మింటన్ అకాడమీలో బ్యాడ్మింటన్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వేసవి శిక్షణలో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ టి.ప్రభాకర్‌రెడ్డి, హోత్రిశ్రీ, అకాడమీ స్థల దాత వంశీదాత, ఈవోపీఆర్డీ జయమ్మ పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని వినియోగించుకోండి

పీలేరు రూరల్ : మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి తపాలా శాఖ ఎస్‌ఎస్‌పీ జాఫర్ సాధిక్ అన్నారు. శనివారం స్థానిక తపాలా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలికలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కేంద్రం ప్రభుత్వం కొత్తగా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. రెండు సంవత్సరాల కాల పరిమితితో ఉండే ఈ పథకం కింద 18 సంవత్సరాలు నిండిన బాలికలు, మహిళలు ఖాతాలు ప్రారంభించవచ్చునని చెప్పారు. రూ. వెయ్యి నుంచి రూ.2 లక్షల వరకు ఈ ఖాతాలో జమ చేసుకోవచ్చునని తెలిపారు. 7.5 శాతం వడ్డీ రేటు లభిస్తుందని చెప్పారు. పీలేరు తపాలా శాఖ ఆధ్వర్యంలో ఈ నెలాఖరుకల్లా పది ఖాతాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయభాస్కర్, పోస్టుమాస్టర్ వై.శేషాద్రి, పీపీఎం ఖాదర్‌బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తపాలా శాఖ ఎస్‌ఎస్‌పీ జాఫర్ సాధిక్

వలంటీర్‌కు కన్నీటి వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పని చేస్తున్న తలారీ జయచంద్ర (25) శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. వెంకటప్ప, రవణమ్మ దంపతుల కుమారుడు జయచంద్ర ఇదే గ్రామానికి చెందిన శివ, పార్వతమ్మ దంపతుల కుమార్తె సునీతను ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం సునీత ఓ మగబిడ్డకు జన్మనిచ్చింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని టి.సదుంకు తీసుకు రాగా కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. ప్రతి నెలా 1వ తేదీన వేకువ జామునే తమ ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము ఇచ్చేవాడు. ఇలా హఠాత్తుగా చనిపోతాడని తాము ఎన్నడూ ఊహించలేదని గ్రామస్తులు కంటతడి పెడుతూ విచారం వ్యక్తం చేశారు. సచివాలయం సిబ్బంది, తోటి వలంటీర్లు.. మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. శనివారం బరువెక్కిన గుండెలతో వలంటీర్ అంత్యక్రియలు నిర్వహించారు.



జయచంద్ర (ఫైల్)

బస్సు సర్వీసు పొడిగింపు

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కృషితో ఆర్టీసీ అధికారులు శనివారం బస్సు సర్వీసు పొడిగించారు. బి.కొత్తకోట నుంచి మండలంలోని కాట్నగల్లు వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీసును 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న సత్యసాయి జిల్లా పూలకుంటవారిపల్లి వరకూ నడిపేలా చూడాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సమస్యపై స్పందించిన ఆయన మదనపల్లి వన్ డిపో మేనేజర్ ఎంవీ రమణారెడ్డితో మాట్లాడి సర్వీసు పొడిగించేలా కృషి చేశారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతోపాటు కండక్టర్ శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం బస్సు సర్వీసుకు గ్రామస్తులు హారతులు పట్టి ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

వేరుశనగ విత్తన కాయల పంపిణీ

ములకలచెరువు : తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని వేపూరికోట సచివాలయంలో రాయితీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేసారు. రైతులు విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సునీతతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్, మల్లికార్జున రెడ్డి, జయరాం రెడ్డి, రామిరెడ్డి, మారప్ప, నారాయణస్వామి, క్రిష్ణప్ప, వెంకట్రమణ సూచించారు.

రేపటి నుంచి అడ్మిషన్లు

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో సోమవారం నుంచి అడ్మిషన్లు జరుగుతాయని ఏపీఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు 5, 6, 7, 8 తరగతులలో ఈ నెల 12న నేరుగా ప్రవేశం పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు. అలాగే గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశానికి ఈ నెల 12న ఎంపీసీ, 13న బైపీసీ, 14న ఎంఈసీ గ్రూపులకు సంబంధించి కర్నూలు మైనారిటీ ఉర్దూ గురుకుల పాఠశాల ఆవరణలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. డిగ్రీ ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 15న గుంటూరు పాతబస్టాండు సమీపంలో గల పరీక్ష భవన్‌లో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ములకలచెరువు : మండలంలోని గూడుపల్లి, కాలువపల్లి పంచాయతీల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సాయిలీలా, సర్పంచులు మహబూబ్‌బాషా, రెడ్డెప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా గూడుపల్లి, కాలువపల్లి పంచాయతీ గ్రామాల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పర్యటించనున్నట్లు వారు తెలియజేశారు. ప్రజా సమస్యలపై అధికారుల సమక్షంలో పరిష్కారం చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

బి.కొత్తకోట : మదనపల్లె వైపు నుంచి బి.కొత్తకోటకు వస్తున్న కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటన శనివారం మండలంలోని పత్రవారిపల్లె వద్ద జరిగింది. పోలీసులు, బాధితుల కథనం మేరకు వివరాలు..బి.కొత్తకోటకు చెందిన యువకులు తోహిద్, తరుణ్, విష్ణులు కారులో శీలంవారిపల్లె పంచాయతీ తోకలపల్లె నుంచి బి.కొత్తకోటకు వస్తున్నారు. కారు గుట్టపాళ్యం దాటి పత్రవారిపల్లె వద్దకు రాగానే ఎదురుగా బి.కొత్తకోట వైపు నుంచి కారు వస్తుండగా వేగాన్ని నియంత్రించి పక్కకు వెళ్లే క్రమంలో అదుపుతప్పిన కారు రోడ్డుపక్కనే (పత్రవారిపల్లె) నివాస గృహాలపైకి దూసుకెళ్లింది. బండలపై నుంచి ఇళ్లపైకి దూసుకెళ్లడంతో శంకర, నరసింహులకు చెందిన ఇళ్ల వరండాలకు వేసిన సిమెంటు రేకులు ధ్వంసమయ్యాయి. కారుపైకి వెళ్లి మళ్లీ రోడ్డుపైకి బోల్తా పడింది. ఈ సమయంలో పాలక్యాన్ల కోసం రోడ్డుపక్కన పార్కింగ్ చేసిన శివబాలరాజుకు చెందిన ఆటోపై పడగా పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో కారు పూర్తిగా ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. బాధితులను ఈఎంటీ ఉమశ్రీ, పైలట్ రాజులు 108లో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. తోహిద్‌కు ఎడమచేయి ఎముక విరగ్గా, తరుణ్‌కు తీవ్ర గాయాలైనట్లు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు తోహిద్‌ను మదనపల్లెకు, తరుణ్‌ను బెంగళూరుకు తరలించారు. విష్ణుకు ఎలాంటి గాయాలు కాలేదు.

సారా స్థావరాలపై దాడులు



ఊట ధ్వంసం చేసి డ్రమ్ములు స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

కేవీపల్లె : 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతోపాటు 800 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. శనివారం మండలంలోని దిగువగల్ల తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. సారా బట్టీలు గుర్తించి 800 లీటర్ల బెల్లం ఊట, 15 లీటర్ల సారా ఉన్నట్లు గుర్తించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్ట్

నిమ్మనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో నాటుసారా విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని వెంగంవారిపల్లె పంచాయతీ బాలినాయనిపల్లెకు చెందిన రమణ సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదే విధంగా రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లెకు చెందిన రెడ్డిరాజా, వసంతశేఖర్‌లు చిన్నంవారిపల్లెకు సమీపంలో సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట

కేవీపల్లె : మండలంలోని తిమ్మాపురం పంచాయతీ నారమాకులమిట్టలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా సమేత రాములవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి సతీమణి శాంతకుమారి జ్ఞాపకార్థం నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. మూడు రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. శనివారం వేదమంత్రాల నడుమ సీతారాముల విగ్రహ ప్రతిష్ట చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. అనంతరం సూర్యనారాయణరెడ్డిని గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్‌రెడ్డి, ప్రవీణ, చిన్నరెడ్డి, జయలత, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నూతన ఆలయంలో ప్రతిష్టించిన సీతారాముల విగ్రహాలు

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పీలేరు రూరల్ : పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని యల్లమంద క్రాస్, కావలిపల్లెలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలు సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 99 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ పారిశ్రామికవేత్త జి.వి.రాకేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు ఆనంద్, నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, ఉదయ్, ఎం.మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విజయశేఖర్ రెడ్డి, బాలం నరేంద్రరెడ్డి, సాంబశివారెడ్డి, సునీల్ రెడ్డి, సాయి, నాగభూషణం, హబీబ్‌బాషా, గోవర్ధన్ రెడ్డి, రాణి, రాజేశ్వరి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జి.వి.శ్రీనాథరెడ్డి

బాస్కెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

వాల్మీకిపురం : ఉమ్మడి చిత్తూరు జిల్లా బాస్కెట్ బాల్ అండర్ 18 బాల బాలికల క్రీడా జట్టును శనివారం స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపిక చేశారు. జిల్లా వ్యాప్తంగా 80 మంది క్రీడాకారులు హాజరు కాగా, విశేష ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఇందులో బాలుర జట్టు నుంచి ప్రవీణ్, కిరణ్ కుమార్, గిరీష్, సాయి శ్రీవైష్ణవ్, క్రిష్ణ కౌశిక్, అశోక్, చేతన్, దివాకర్, సుధీర్, గురుచరణ్, చైతన్య, హిమ చరణ్, స్టాండ్ బైగా హేమంత్ కుమార్, చరణ్ తేజ్, రెడ్డి శ్రీకర్, తరుణ్ కుమార్ ఉన్నారు. అలాగే బాలికల జట్టుకు హర్షిణి చౌదరి, విదీష, లాలిత్య, జెన్ని సాహితి, గాయత్రి, సంజన, వర్షిత, మమత, రిషిత, జ్ఞానశ్రీ, రిషిత, తనుశ్రీ, స్టాండ్‌బైగా ఉదయశ్రీ, దీపన్విత ఉన్నారు. వీరు ఈ నెల 29, 30న నూజివీడులో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ రవిచంద్ర, కోచ్ అంజిబాబు, సీనియర్ క్రీడాకారులు సుబ్రహ్మణ్యం, సాయిభార్గవ్, పద్మనాభ కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



జిల్లా జట్లకు ఎంపికైన బాలబాలికలు

బైక్‌లను ఢీకొన్న బొలెరో: ఒకరి మృతి

మదనపల్లె : మదనపల్లె – తిరుపతి జాతీయరహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా, మరో నలుగురు గాయపడ్డారు. తిరుపతి నుంచి మదనపల్లె వైపు వస్తున్న బొలేరో వాహనం రెండు ద్విచక్రవాహనాలను ఢీకొంది. ప్రమాదంలో మదనపల్లెకు చెందిన మునివేలు(62) మృతి చెందగా, అతని భార్య విజయలక్ష్మి(56), కుమార్తె ప్రసూనా(22), అనంతపురం జిల్లాకు చెందిన రాజారెడ్డి(60), రెడ్డిమంజు(40)లు గాయపడ్డారు. పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన మునివేలు కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. శనివారం భార్య విజయలక్ష్మి, కుమార్తె ప్రసూనతో కలిసి ద్విచక్రవాహనంలో సీటీఎంలో ఉన్న బంధువుల ఇంటికి బయలుదేరారు. అలాగే అనంతపురం జిల్లా గొడ్డుపల్లెకు చెందిన రాజారెడ్డి, రెడ్డిమంజులు ద్విచక్రవాహనంలో ఓబిరెడ్డిగారిపల్లెకు బయలుదేరారు. వీరిద్దరి బైక్‌లను మదనపల్లె మండలం పోతపోలు పంచాయతీ కొత్తపేట వద్ద వెళుతుండగా ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో మునివేలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మిగిలిన నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. విజయలక్ష్మి, ప్రసూనాలకు తీవ్రగాయాలు కావడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ సీఐ సత్యనారాయణ సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదతీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



మృతిచెందిన మునివేలు (ఫైల్)



గాయపడిన విజయలక్ష్మి